## జిల్లా నామినేటెడ్ పదవుల్లో కార్యకర్తలకు


# అవకాశం కల్పించాలి

- సీటు త్యాగం చేసి సీపీఐ గెలుపులో కీలక పాత్ర
- కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రధాన్యత ఇవ్వాలి
- బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వంతో పోరాడి అనేక కేసులు
- పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు
- సీఎం రేవంత్, జిల్లా మంత్రులు, టిపిసిసి ప్రెసిడెంట్‌కు విజ్ఞప్తి



**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ఏ కార్యక్రమాన్ని అయినా తూ.చ తప్పకుండా విజయవంతం చేయడంలో కార్యకర్తల పాత్ర ఎనలేనిదని, కాంగ్రెస్ పార్టీ గెలుపునకు భుజాలు అరిగిలే జెండాలు మోసి బిఆర్ఎస్ నిరంకుశత్వాన్ని ఛేదించి ప్రజాపాలన సాధించుకున్నామని, భద్రాద్రి జిల్లాలో రానున్న నామినేటెడ్ పదవుల్లో అధిష్టానం నిర్ణయాన్ని మన్నించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీటు త్యాగం చేసి, కష్టపడ్డ కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు జిల్లాలో మెజారిటీ పదవులు కేటాయించాలని పీసీసీ అధ్యక్షులు,ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులకు పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు విజ్ఞప్తి చేశారు. గత 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వంతో పోరాడి అనేక కేసులు ఎదుర్కొని, ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేసి అప్పటి పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, గడప గడపకు కాంగ్రెస్ కాంగ్రెస్ మొదలైన కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ పార్టీని కొత్తగూడెం నియోజకవర్గంలో బలంగా నిలబెట్టిన సమయంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షమైన సిపిఐకి కొత్తగూడెం సీటు కేటాయించినప్పటికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు శ్రమించి కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలను గౌరవించి సిపిఐ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించడం జరిగింది. అదేవిధంగా పార్లమెంట్, మండలి ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కీలక పాత్ర పోషించారని, రానున్న జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో కొత్తగూడెం నియోజకవర్గములో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి న్యాయం చేయాలని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులకు పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు విజ్ఞప్తి చేశారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీకి నాగా సీతారాములు నివాళులు

**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని,ఆస్తులను దానం చేశారని భావితరాలకు ఆయన గురించి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్కరి భాధ్యత అని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్బంగా గాంధీభవన్ లో బాపూజీ ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, సబ్బండవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి, సాయుధ పోరాట కాలంలో పెత్తందార్లను ఎదిరించి నిలిచిన యోధులకు వారికి న్యాయవాదిగా సేవలందించి, వారి తరపున న్యాయపోరాటం చేసిన ప్రజాస్వామిక వాది అని, గాంధీజి స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిని నిలిపారని, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం సహాకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషిచేశారని తెలియజేశారు. ప్రతి ఒక్కరు ఆయన వేసిన బాటలో బంగారు తెలంగాణ కోసం శ్రమించాలని, భవిష్యత్ తరాలకోసం అనునిత్యంప్రతి ఒక్కరు కష్టపడాలని, భావి తరాల కోసం బంగారు బాట వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో సేవాదళ్ రాష్ట్ర సెక్రెటరీ కొదుమూరి దయాకర్, భద్రాచలం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు పిలకా వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి

# ఏరియా సింగరేణి యామాన్యం నివాళి

**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము నందు స్వర్గీయులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడకను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడని, అలాగే స్వాతంత్ర ఉద్యమాలలో నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని, తెలంగాణ కోసం మంత్రి పదవిని కూడా తృణపాయంగా వదిలేసి నిబద్ధత కలిగిన రాజకీయవేత్త, రాష్ట్ర చేనేత సహకారం రంగానికి కూడా చేశారని తెలియజేశారు. 96 సంవత్సరాల వయసులో కూడా చలిని లెక్క చేయకుండా ఢిల్లీలోని జంతర్ మంతర్ లో తెలంగాణ కోసం దీక్ష చేశారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం కొరకు వారు అహర్నిశలు కృషి చేశారని అనేక సమ్మెల లో కూడా పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు ఎస్ ఓ టు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏఐటియుసి వైస్ ప్రెసిడెంట్ కొత్తగూడెం ఏరియా, కే.రాములు, ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ కొత్తగూడెం ఏరియా ఎండి. రజాక్, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ ఏ ఉపేంద్ర బాబు, ఎజిఎం(ఫైనాన్స్) కే హనా సుమలత, డిజిఎం (పర్సనల్) బి. శివ కేశవరావు, డీజీఎం (ఐఈడి) ఎన్.యోహాన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఏం వెంకటేశ్వర రావు, ఎన్విరాన్మెంట్ ఎస్.ఓ.ఎం టి.సత్యనారాయణ, డివై. పిఎం ఎం. శ్రావణ్ కుమార్, సీనియర్ పిఓ ఎం. మురళి, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌరియా, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీలు కే.సౌజన్య, సిహెచ్ సాగర్, జిఎం కార్యాలయంలోని ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు రాముకు టియూడబ్ల్యూజే(టిజేఎఫ్) నివాళి

**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సీనియర్ రిపోర్టర్ మిద్దె రాము పార్థివ దేహానికి టియూడబ్ల్యూజే(హెచ్-143) యూనియన్ జిల్లా కార్యదర్శి షఫీ, టెంజు అధ్యక్షులు వట్టికొండ రవి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత్రికేయుడిగా వివిధ పత్రికల్లో పనిచేసిన రాము హటాత్మరణం విచారకరమని వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. సీనియర్ రిపోర్టర్స్ మోటమర్రి రామకృష్ణ, సీమకుర్తి రామకృష్ణ, యెర్రా సర్వేష్, కెరటం శ్యామ్, తెలంగాణ సురేష్, రహీమ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొని రాముకు నివాళులర్పించారు.

## రాష్ట్రం కోసం అలుపెరగని కృషి చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని గ్రంథ పాలకులు నవీన్, మణి మృదుల అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. బహు భాషా కోవిదుడైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది శ్రీదేవి, శ్రీకాంత్, గ్రంథాలయ పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ఈడి దాడులకు భయపడేది లేదు

## టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు

**కొత్తగూడెం, సెప్టెంబర్27(కెరటం ప్రతినిధి)**

తెలంగాణలో సుపరిపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలపై కుట్ర చేస్తున్నారని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. బీజేపీలో అభద్రతాభావం పెరిగిందనడానికి నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై జరుగుతున్న ఈడి దాడులే నిదర్శనమన్నారు. దేశంలో బీజేపీ పై వ్యతిరేకత వ్యక్తం అవుతున్న వేళ కాంగ్రెస్ నేతలను భయాందోళనకు గురి చేసేందుకే ఐటి, ఈడీ, పోలీసుల దాడులను బిజెపి నేతలు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆత్మీయ బంధువు మంత్రి పొంగులేటి శ్రీనన్న పై ఎన్ని సార్లు దాడులు చేసిన ఆయన్ని, ఆయన అనుచరగణాన్ని, ఆయన వెనకున్న ప్రజాసైన్యాన్ని భయపెట్టలేరని ఆయన అన్నారు. కాళేశ్వరం సహా, అనేక అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న కేసీఆర్ అండ్ కో లపై మోడీ ఈడి ని పంపగలరా అని సవాల్ విసిరారు.